

Postal License No.VJ/220/2023-25

నేటి పత్రిక

# ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వార పత్రిక

TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL

Prajavatha-Online Telugu News

http://www.prajavartha.com

వీక్షించండి.. చదవండి... చెప్పండి...

విజయవాడ | తేదీ : 24-30 ఏప్రిల్ 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 04 | సంచిక : 46 | పేజీలు : 4 | రూ. 5.00


## దేశ భవిష్యత్ యువత చేతిలోనే



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను వారు అందిపుచ్చుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఉద్యోగంతోనే సంతృప్తి చెందకుండా, సంస్థలను స్థాపించే స్థాయికి యువత ఎదగాలని అన్నారు. మే 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని పనుల పున:ప్రారంభం కాబోతున్నాయని చెప్పారు. ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని, క్వాంటమ్ వ్యాలీకి అమరావతి కేరాఫ్ అడ్రస్ కానుందని అన్నారు. విట్ వర్సిటీలో 'వి లాంచ్‌పాడ్ 2025 – స్టార్టప్ ఎక్స్ పో'లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. క్యాంపస్‌లో మహాత్మాగాంధీ బ్లాక్, వి.వి.గిరి బ్లాక్, దుర్గాబాయి దేశ్ ముఖ్ బ్లాక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీఎం చంద్రబాబు మాట్లాడారు.

**విశ్వనాథన్‌తో నాది ప్రత్యేక అనుబంధం**.. విట్ అధినేత విశ్వనాథన్ సాధారణమైన వ్యక్తిగా తన జీవితం ప్రారంభించి అసాధారణమైన వ్యక్తిగా ఎదిగిన తీరు అభినందనీయం. 20 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నారు. ఆ రోజుల్లో పార్లమెంటులో అన్నాదురైతో తర్వాత కరుణానిధి, ఎంజీఆర్, జయలలితతో పనిచేశారు. విశ్వనాథన్ 2014లో ఎన్నికల ఫలితాలు రాకముందే నన్ను కలిశారు. గెలిచిన వెంటనే అమరావతిలో విట్ ఏర్పాటుకు అనుమతి కోరారు. ఆ రోజు విట్ కోసం విశ్వనాథన్ గారు 200 ఎకరాలు అడిగారు. నేను 100 ఎకరాలు ఇచ్చాను. వారికి కావాల్సిన మరింత భూమి ఇచ్చే బాధ్యత నాది. అయితే... రాబోయే ఏడేళ్లలో 50 వేల మంది స్టూడెంట్స్ విట్‌లో చదివేలా అభివృద్ధి చెందాలి. విట్ అమరావతిలో 95 శాతం ప్లేస్‌మెంట్స్ జరుగుతుండటం అభినందనీయం. ప్రపంచంలోని టాప్ 100 యూనివర్సిటీలో విట్ ఉండటం మనకు గర్వకారణం. విట్ విద్యాసంస్థల్లో మన అమరావతి విట్ నెంబర్‌వన్‌గా ఉండాలని నేను కోరుకుంటున్నాను.

**అమరావతికి తిరుగులేదు ...** ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పనులు పున: ప్రారంభమవుతాయి. నేను అందరిలా మాటలు చెప్పను. ప్రజలకు మంచి చేసి చూపిస్తాను. నాపై నమ్మకం పెట్టుకుని 29 వేల మంది రైతులు, 34 వేల ఎకరాల భూమి రాజధానికి ఇచ్చారు. అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని రైతులు ముందుకురావడం అభినందనీయం. 1991లో ఆర్థిక సంస్కరణలకు మన తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు శ్రీకారం చుట్టారు. వాటిని నేను అందిపుచ్చుకున్నాను. భవిష్యత్ ఐటీదే అని గ్రహించి దానికి అధిక ప్రాధాన్యత ఇచ్చాను. 14 నెలల్లో హైటెక్ సిటీ నిర్మించాం. ఇప్పుడు రాజధాని అమరావతిపై దృష్టి కేంద్రీకరించాం. త్వరలో అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయబోతున్నాం. సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి ఫౌండేషన్ వేస్తున్నాం. ఒకప్పుడు నేను ఐటీ మాట్లాడితే కొందరికి అర్థం కాలేదు. ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటర్ గురించి మాట్లాడితే అది ఏం చేస్తుందంటున్నారు. ప్రతి ఇంట్లో ఎంట్రప్రెన్యూర్ తయారుకావాలి. అమరావతిలో విట్, ఎస్ఆర్ఎం వంటి విద్యాసంస్థలు **(తరువాయి.. 2వ పేజీలో)**

## ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏనుగుల గుంపుచే పంటల ధ్వంసం..

***రైతు దుర్మరణంపై ఉప ముఖ్యమంత్రి సమీక్ష... పవన్ కల్యాణ్ ఆదేశాలతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు***



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏనుగుల గుంపుల మూలంగా పంటలు ధ్వంసం కావడం, కొందరు రైతులు దుర్మరణం పాలవుతున్న ఘటనలు చోటు చేసుకొంటున్న క్రమంలో అటవీ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇటీవలే తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లులో ఒక కౌలు రైతు ఏనుగుల దాడిలో చనిపోవడం, తాజాగా పాకాల మండలం గానుగపెంటలో పంటలు ధ్వంసం చేసిన ఘటనలపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏనుగుల మూలంగా ప్రజలకు, ప్రజల మూలంగా ఏనుగులకు హాని కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రివర్యులు తెలిపారు. ఏనుగుల మందలు అటవీ ప్రాంతాల నుంచి సమీప గ్రామాలకు అడవుల్లోకి వచ్చేస్తున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అటవీ ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా ఎలిఫెంట్ కారిడార్ లో భాగంగా ఏనుగుల మందలు, ఒంటరి ఏనుగులు ఎటు వెళ్తున్నాయో ట్రాక్ చేయడంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతోపాటు ఎలిఫెంట్ ట్రాకర్స్ సేవలు స్వీకరించాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ తక్షణమే ఏర్పాటు చేయాలని పీసీసీఎఫ్ ను ఆదేశించారు.

**తిరుపతి డి.ఎఫ్.ఓ. అధ్వర్యంలో టాస్క్ ఫోర్స్..** ఉప ముఖ్యమంత్రివర్యుల ఆదేశాలను అనుసరించి తిరుపతి డి.ఎఫ్.ఓ. పి.వివేక్ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేశారు. చిత్తూరు డి.ఎఫ్.ఓ. ఎస్.భరణితోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్ కి సంబంధించిన పీలేరు, తిరుపతి డి.ఎఫ్.ఓ.లు, తిరుపతి సబ్ డి.ఎఫ్.ఓ.లతోపాటు తిరుపతి భాకరపేట, పనపక్కం, చిత్తూరు ఈస్ట్, చిత్తూరు వెస్ట్ పరిధిలో ఎఫ్.ఆర్.ఓ.ల టీమ్స్, పది మంది ఎలిఫెంట్ ట్రాకర్స్ ఈ టాస్క్ ఫోర్సులో ఉంటారు. వీరి బాధ్యతలను కూడా నిర్దేశిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

## ప్రజా రాజధానికి మళ్లీ ఊపిరి పోద్దాం

***మంగళగిరి నియోజకవర్గం బేతపూడి గ్రామంలో నర్వ్ రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్***



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభానికి మే 2న రాష్ట్రానికి గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు వస్తున్నారని, ఆయనకు ఘన స్వాగతం పలకడంతోపాటు సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. ఏ దేశ ప్రధాని కూడా రాజధాని నిర్మాణ పనులకు రెండోసారి శంకుస్థాపన చేయరని, అయితే జగన్ చేసిన దుర్మార్గాలు తెలుసుకొని, నష్టపోయిన రైతులకి అండగా నిలబడటం కోసం మళ్లీ వస్తున్నారని తెలిపారు. దేశ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ మన కోసం ఆయన సమయం వెచ్చించి అమరావతికి వస్తున్నారని, ఆయన పర్యటన విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అమరావతి పర్యటన నేపథ్యంలో సోమవారం మంగళగిరి నియోజకవర్గం బేతపూడి రామాలయం సెంటర్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని పర్యటన విజయవంతం చేయాలంటూ రాజధాని రైతులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతే ఏకైక రాజధాని. అమరావతి లేకపోతే మనకు అడ్రస్ లేనట్టే. తెలంగాణకు హైదరాబాద్, తమిళనాడుకు చెన్నై, కర్ణాటకకు బెంగళూరు ఉన్నట్లు మనకు ఒక బలమైన రాజధాని అవసరం.

**అమరావతి విషయంలో జగన్ ఎన్నో పాపాలు చేశారు...** విడిపోయిన రాష్ట్రానికి హైదరాబాద్ నగరం లాంటి బలమైన రాజధాని ఉండాలని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అమరావతిని ఎంచుకున్నారు. ఆయన పిలుపు మేరకు 29 గ్రామాల రైతులు 33 వేల ఎకరాలు రాజధాని కోసం ఇచ్చారు. భూములు ఇచ్చిన ప్రతి రైతును ఆదుకుంటామని ఆనాడుచంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో ఇచ్చిన హామీని జగన్ ప్రభుత్వం తుంగలో తొక్కింది. జగన్ ముఖ్యమంత్రి కాగానే మూడు రాజధానుల పేరుతో అమరావతిని ప్రణాళికబద్ధంగా నిర్వీర్యం చేశారు. ఇక్కడ నిర్మించిన రోడ్లను తవ్వేశారు. రాజధాని నిర్మాణం కోసం తీసుకువచ్చిన కంకర, గ్రావెల్ ను అక్రమంగా తరలించుకుపోయి అమ్ముకున్నారు. పెట్టుబడులు పెట్టడానికి వచ్చినవాళ్లు పారిపోయేలా వ్యవహరించారు. జగన్ దుర్మార్గపు పనుల వల్ల దాదాపు 10 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఇంగితం ఉన్న ఏ ముఖ్యమంత్రి కూడా ఆ విధంగా వ్యవహరించరు. పరిపాలన అనుభవం లేని వ్యక్తి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం ఎలా నష్టపోతుందో గత ఐదేళ్లు మనం చూశాం.

**మీరు నిలబెట్టిన కూటమే ఇది...** గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజధాని రైతులు, మహిళలు ఎన్నో ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నారు. చేయని తప్పులకు కేసుల్లో ఇరుక్కున్నారు. గత ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా అలుపెరుగని పోరాటం చేశారు. ప్రతి రోజు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా దీక్షలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రలు చేపట్టారు. ముఖ్యంగా రాజధాని ప్రాంత మహిళలు దాదాపు 200 మంది జనసేన కేంద్ర కార్యాలయానికి వచ్చి వపన్ కళ్యాణ్ గారి ఎదుట తమ సమస్యలు చెప్పుకొని కన్నీరు పెట్టుకున్నారు. ఆ మరుసటి రోజే శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలకు కలిసి రాజధాని ప్రజలు పడుతున్న కష్టాలు వివరించారు. స్వయంగా ప్రధాని శ్రీ మోడీ గారే శంకుస్థాపన చేసిన అమరావతిని వైసీపీ నాయకులు ఎలా నాశనం చేస్తున్నారో వివరించారు. ఆనాడు రాజధాని రైతులు పెట్టిన కన్నీరే

**(తరువాయి..2 వ పేజీలో)**

## ప్రధాని మోదీ అమరావతి పర్యటన విజయవంతం చేద్దాం

***-ఎన్డీఏ నేతలతో సీఎం చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్***

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : అమరావతి రాజధాని పనుల పున:ప్రారంభానికి మే 2న రాష్ట్రానికి వస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి ఘన స్వాగతం పలకడంతో పాటు సభను విజయవంతం చేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నేతలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ పర్యటనపై ఎన్డీఏ నేతలతో సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు.

**అమరావతి ఆంధ్రప్రదేశ్ ప్రజల గర్వకారణం...** ఒక కుటుంబం నివసించేందుకు మంచి ఇల్లు ఉండాలని ఎలా అనుకుంటామో ప్రజలు గర్వంగా చెప్పుకోవడానికి కూడా రాజధాని ఉండాలి. అభివృద్ధి వికేంద్రీకరణ ఎన్డీఏ విధానం కాబట్టే 2014 నుంచి కేంద్ర విద్యా సంస్థలు ఉత్తరాంధ్ర, కోస్తా, సీమ జిల్లాల్లో ఏర్పాటు చేశాం. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తాం. తెలంగాణకు హైదరాబద్, కర్నాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై రాజధానుల ద్వారా 70 శాతం ఆదాయం వస్తోంది. మనకు కూడా మంచి నగరం ఉంటే రాష్ట్రానికి సమృద్ధిగా ఆదాయం సమకూరుతుందని అమరావతిని నిర్మిస్తున్నాం. రాష్ట్రానికి అమరావతి ఆత్మ వంటిది.

**ప్రజల్ని తప్పుదారి పట్టించే వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి...** రాజధాని నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. వారు ఇచ్చిన భూముల్లోనే రాజధాని నిర్మించడంతో పాటు తిరిగి వారికి రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లు అభివృద్ధి చేసి ఇస్తున్నాం. రాజధానిలో రైతులను భాగస్వాములను చేస్తున్నాం. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తే యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయి. రోడ్ల నిర్మాణం జరిగితే రవాణా సౌకర్యం పెరగడంతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. కానీ కొన్ని వ్యతిరేక శక్తులు కుట్రతో ప్రజలను కావాలనే తప్పుదోవ పట్టిస్తాయి. అభివృద్ధిపై బురద జల్లే ప్రయత్నం చేస్తుంటాయి. మనం ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు చేస్తున్న మంచి పనులను గురించి కూడా వివరించాలి. ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకుని ప్రజలకు తెలియజేయాలి. ఇబ్బందులను అధిగమిస్తూనే సంక్షేమం, అభివృద్ధి బాటను వీడటం లేదు.

**హామీలు నెరవేర్చుకుంటూ ముందుకు...** అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ మెందుకెళ్తున్నాం. పోలవరానికి నిధులు, విశాఖ రైల్వేజోన్ మంజూరు, స్టీల్ ప్లాంట్‌కు రూ. 11,400 కేంద్రం కేటాయించింది. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఇప్పటికే మత్స్యకారుల సేవలో, ఎస్సీ వర్గీకరణ, అన్నక్యాంటీన్లు, పింఛన్లు, 3 గ్యాస్ సిలిండర్లు అందించడంతో పాటు 16,347 ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం. వచ్చే నెల రైతులకు అన్నదాత కింద పెట్టుబడి సాయం అందిస్తాం.

**లాజిస్టిక్ హబ్‌గా రాయలసీమ...** రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే 42 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుడతాం. 175 నియోజకవర్గాల్లోనూ రాబోయే రోజుల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి చేసి వన్ ఫ్యామిలీ%% వన్ ఎంట్రప్రెన్యూర్ సాకారం దిశగా అడుగులు వేస్తాం. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కూడా చేపడతాం. విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం. ఎర్రైన్–కో రామాయపట్నంలో, అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ దిగ్గజ కంపెనీలు లక్ష కోట్లతో పెట్టుబడులు పెడుతున్నాయి. మిట్టల్ ప్లాంట్ పూర్తయితే రెండు స్టీల్ ప్లాంట్లు, దేశంలోనే ఎక్కువ స్టీల్ ఉత్పత్తి చేసే జిల్లాగా ఉమ్మడి విశాఖ రికార్డు సృష్టిస్తుంది. రాయలసీమను డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్స్, డ్రోన్, శాటిలైట్ లాంచింగ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అభివృద్ధి చేస్తాం. రాయలసీమకు బెంగళూరు, హైదరాబాద్ అనుసంధాన హైవేలు, ఎయిర్ పోర్టులు అందుబాటులో ఉంటాయి. తద్వారా లాజిస్టిక్ హబ్‌గా రాయలసీమ మారుతుంది.' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## పెగాసస్ నివేదికపై సుప్రీం కీలక వ్యాఖ్య..

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : పెగాసస్ స్పైవేర్ వివాదంపై సాంకేతిక కమిటీ సమర్పించిన నివేదికను బహిర్గతం చేయలేమని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. దేశ భద్రత, సార్వభౌమాధికారానికి సంబంధించిన సున్నితమైన అంశాలున్నందున ఈ నివేదికను బయటపెట్టలేమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. దేశ భద్రతకు సంబంధించిన నివేదికలోని అంశాలను బహిరంగ చర్చకు పెట్టడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. "దేశ భద్రత, సార్వభౌమాధికారానికి సంబంధించిన ఏ నివేదికనూ మేం బహిర్గతం చేయబోం. అటువంటి నివేదికలను వీధి చర్చల పత్రంగా మార్చకూడదు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పెగాసస్ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఇదే సమయంలో వ్యక్తిగత గోప్యతా ఉల్లంఘనకు సంబంధించిన ఆందోళనలను పరిష్కరించే విషయాన్ని పరిశీలించవచ్చని ధర్మాసనం సూచనప్రాయంగా తెలిపింది. గోప్యతా హక్కుకు భంగం వాటిల్లిందని భావించే వ్యక్తుల నిర్దిష్ట కేసులను పరిశీలించే అవకాశం ఉందని సంకేతాలిచ్చింది. దేశ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూనే, వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన ఫిర్యాదులను వినేందుకు సుప్రీంకోర్టు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. పెగాసస్ వ్యవహారంలో సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సాంకేతిక నిపుణుల కమిటీని గతంలో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ కమిటీ నివేదికను సమర్పించినప్పటికీ, దానిలోని అంశాలను గోప్యంగా ఉంచాలని సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయించింది.

## దూసుకుపోయిన స్టాక్ మార్కెట్లు...

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. ఓ వైపు ఇండియా–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ... విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు కొనసాగుతుండటం, బ్లూ చిప్ కంపెనీల మెరుగైన త్రైమాసిక ఫలితాల కారణంగా మన సూచీలు రాణించాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,005 పాయింట్లు లాభపడి 80,218కి ఎగబాకింది. నిఫ్టీ 289 పాయింట్లు పెరిగి 24,328 వద్ద స్థిరపడింది. అమెరికా డాలరుతో మన రూపాయి మారకం విలువ 37 పైసలు బలపడి రూ. 85.04గా ఉంది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్..** రిలయన్స్ (5.27%), సన్ ఫార్మా (3.08%), టాటా స్టీల్ (2.42%), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (2.36%), యాక్సిస్ బ్యాంక్ (2.35%).

**టాప్ లూజర్స్:..** హెచ్సీఎల్ టెక్నాలజీస్ (-1.89%), అల్ట్రాటెక్ సిమెంట్ (-1.05%), హిందుస్థాన్ యూనిలీవర్ (-0.52%), నెస్లే ఇండియా (-0.42%), బజాజ్ ఫైనాన్స్ (-0.21%).

## ఎంఎస్ఎంఈలకు బ్యాంకులు చేయూతనివ్వాలి : ముఖ్యమంత్రి



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : వచ్చే నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంపద సృష్టి, పేదరిక నిర్మూలన లక్ష్యంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నామని... ఓవైపు స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు అనుగుణంగా పనిచేస్తూనే... మరోవైపు 2029 కల్లా పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు, లక్ష్యాల పై ప్రధానంగా దృష్టి పెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దీనికి బ్యాంకులు సంపూర్ణ మద్దతివ్వాలని, 2025-26లో నిర్దేశించుకున్న క్రెడిట్ ప్లాన్ లక్ష్యాలను అధిగమించేలా కృషి చేయాలని మంగళవారం సచివాలయంలో జరిగిన 231వ స్టేట్ లెవెల్ బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఫలితాలపై బ్యాంకింగ్ అధికారులతో చర్చించిన ముఖ్యమంత్రి, 2025-26 లక్ష్యాలను నిర్దేశించారు. నూరు శాతం లక్ష్యాలను అధిగమించి దక్షిణ భారతదేశంలోనే మేటిగా ఉన్నందుకు ముఖ్యమంత్రి బ్యాంకర్లను అభినందించారు. సమావేశంలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి 'ఏపీ యాన్యువల్ క్రెడిట్ ప్లాన్'ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... డ్వాక్రా మహిళలు, కౌలు రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఎదుగుదలకు ప్రత్యేకంగా ఏం చేయగలం అనేది బ్యాంకర్లు ఆలోచించాలని చెప్పారు.

**ఆర్థిక మద్దతుకే ఎస్ఎల్‌బీసీ సమావేశాలు:...** తాను ముఖ్యమంత్రిగా ఎప్పుడున్నా తరచూ ఎస్ఎల్‌బీసీ సమావేశాలు నిర్వహించడానికి ప్రధాన కారణం... రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు బ్యాంకుల మద్దతు కూడగట్టేందుకేనని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సేవలు, పరిశ్రమల రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని... కానీ రాష్ట్ర విభజన తర్వాత ప్రాధాన్యతలు మారాయని... ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగ ఆధారిత రాష్ట్రం కావడం, దీనిపై ఎక్కువమంది ఆధారపడి జీవిస్తుండటంతో వ్యవసాయరంగానికి అండగా నిలిచామన్నారు. వ్యవసాయ అనుబంధరంగాలను సైతం బలోపేతం చేసేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

**బ్యాంకుల సహకారంతోనే పురోగతి :...** డిమాండ్‌కు తగ్గట్టుగా ఏ రంగం పురోగతి సాధించాలన్నా బ్యాంకుల మద్దతు తప్పనిసరి అని చెప్పారు. వివిధ రంగాల్లో భారీగా ప్రాజెక్టులు వస్తున్నాయని, వాటికి అవసరమైన ఆర్థిక మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇంటికో ఎంట్రప్రెన్యూర్ లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈలు, అలాగే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. 2029 కల్లా పేదరికం నిర్మూలించేలా జీరోపావర్టీ-పీ4 అమలు చేసి అసమానతలు తొలిగించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సంపద సృష్టికి, మౌలిక సదుపాయాల కల్పనకు పీపీపీ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేస్తున్నామన్నారు.

**అన్ని ప్రాంతాల అభివృద్ధి మా విధానం :...** విశాఖ ఆర్థికాభివృద్ధిలో అనూహ్య పురోగతి సాధిస్తోందని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. అలాగే అమరావతి భవిష్యత్ అవకాశాలకు వేదికగా చేస్తున్నామని, అటు రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి అన్నారు. పెట్రో కారిడార్‌పై బ్యాంకర్లు దృష్టి పెట్టాలని, మత్స్యకారులు మధ్యవర్తుల ప్రమేయంతో నష్టపోతున్నారని... వారికి నేరుగా రుణాలు ఇవ్వాలని సూచించారు. సముద్ర ఆర్థిక వ్యవస్థలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు చేయొచ్చని దీనికి బ్యాంకర్ల మద్దతు అవసరమన్నారు.

**అన్నివర్గాలకు విరివిగా రుణాలు :...** ఇంటికో ఎంట్రప్రెన్యూర్‌ను తీసుకురావాలన్న ముఖ్యమంత్రి ఆశయం మేరకు క్రెడిట్ ప్లాన్ అమలు చేస్తున్నామని... ఈ ఆర్థిక సంవత్సరంలో కచ్చితంగా లక్ష్యాన్ని అధిగమిస్తామని ముఖ్యమంత్రికి బ్యాంకర్ల తెలిపారు. ప్రత్యేకంగా మహిళా ఎంట్రప్రెన్యూర్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. స్వయం సహాయక బృందాలకు రుణాలు విరివిగా అందిస్తున్నామని చెప్పారు. అలాగే ఎడ్యుకేషన్, హౌసింగ్ విషయంలోనూ ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు.

**లక్ష్యాన్ని మించి క్రెడిట్ ప్లాన్ అమలు :...** 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం క్రెడిట్ ప్లాన్ రూ. 5,40,000 కోట్లు లక్ష్యం పెట్టుకోగా, లక్ష్యాన్ని అధిగమించి రూ. 6,83,672 కోట్ల రుణాలు ఇవ్వడం జరిగింది. ఇది లక్ష్యంలో 127 శాతం వృద్ధి. ఇందులో ప్రయారిటీ సెక్టార్‌కు రూ. 4,14,824 కోట్లు, నాన్ ప్రయారిటీ సెక్టార్‌కు రూ. 2,68,848 కోట్లు అందించాయి.

**వ్యవసాయరంగం :...** గడిచిన ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగం వరకు చూస్తే క్రెడిట్ ప్లాన్ రూ. 2,64,000 కోట్లు లక్ష్యం కాగా, అంతకు మించి రూ. 3,07,089 కోట్లు బ్యాంకులు అందించాయి. **(తరువాయి.. 3వ పేజీలో)**

## త్యాగాలు చేసిన రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఏ కార్యక్రమమూ ఉండదు

***-అమరావతి రైతులతో సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు***



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : అమరావతి పనుల పున:ప్రారంభ కార్యక్రమానికి రావాలంటూ రాజధాని రైతులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు. మే 2వ తేదీ రాష్ట్ర చరిత్రలో కీలక మలుపుకాబోతుందని...రాజధాని నిర్మాణం రాష్ట్ర అభివృద్ధిలో కీలక అడుగు అవుతుందని సిఎం అన్నారు. రాజధాని రైతుల త్యాగం కారణంగానే నేడు ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం చేసుకుంటున్నామని....ఎప్పటికీ రైతుల మంచి మనసును రాష్ట్ర ప్రజలు గుర్తుంచుకుంటారని అన్నారు. రాజధానిలో జరిగే ప్రతి కార్యక్రమం, పనుల్లో భాగస్వామ్యం కావాలని రాజధాని గ్రామాల రైతులను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. మే 2వ తేదీ ప్రధాని చేతుల మీదుగా క్యాపిటల్ పనుల రీ స్టార్ట్ కార్యక్రమం, రైతుల సాధకబాధకాలపై వారితో చర్చించారు. రాజధాని పరిధిలోని వివిధ గ్రామాల రైతులు ఉండవల్లిలోనివాసంలో ముఖ్యమంత్రి ఆహ్వానంతో సిఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై రైతులతో సిఎం చంద్రబాబు చర్చించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం తిరిగి కేటాయించే ప్లాట్లకు బ్యాంకుల ద్వారా రుణం పొందేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు..

'2014లో రాజధాని ప్రకటన తర్వాత రైతులు భూములివ్వకుండా ఉండేందుకు వైసీపీ నేతలు అపోహలు సృష్టించి రెచ్చగొట్టారు. అయినా మాపై నమ్మకంతో రైతులు ముందుకొచ్చి 34 వేల ఎకరాలు ఇచ్చారు. రాష్ట్రం కోసం, మీ జీవితాలు బాగుపడతాయన్న ఉద్దేశంతో కొత్త నగర నిర్మాణానికి భూములు ఇచ్చారు. రాజధానికి భూమిలిచ్చిన రైతులు వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బంది పడ్డారు. వైసీపీ అధికారంలోకి వస్తే రాజధానిని కొనసాగిస్తామని చెప్పి తర్వాత మూడు రాజధానులు, స్మశానం, ఎడారి అని మాట్లాడారు. ఐదేళ్ల మీ పోరాటం, స్థలబలం కారణంగానే అమరావతిని ఏమీ చేయలేకపోయారు. దేవుతల రాజధాని కాబట్టే కదిలించలేకపోయారు. మే 2న రాజధాని నిర్మాణ పనులు పున:ప్రారంభానికి ప్రధాని మోదీ వస్తున్నారు. ప్రతిగ్రామం, ప్రతి ఇంటి నుంచి ఈ సభకు ప్రజలు తరలిరావాలి. మే 2 తరువాత రాజధాని నిర్మాణం వేగవంతం అవుతుంది. రైతులకు కేటాయించిన ప్లాట్లు కూడా అభివృద్ధి చేస్తాం" అని సీఎం చంద్రబాబు కోరారు.

**ఎయిర్ పోర్టు, స్టేడియం నిర్మాణంతో పెరగనున్న భూముల విలువ...** రైతులతో సమావేశంలో రాజధాని అవసరాలకు అదనంగా భూసేకరణ అంశంపైనా చర్చ జరిగింది. ఈ విషయంలో రైతుల అపోహలను సిఎం నివృత్తి చేశారు. 'గతంలో హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి భూ సేకరణ జరిగినప్పుడు 5 వేల ఎకరాలు ఎందుకుని కొందరు ప్రశ్నించారు. కానీ ముందు చూపుతో సేకరించబట్టే ఇంటర్నేషన్ ఎయిర్ పోర్టు నిర్మాణంతో పాటు పెద్ద హోటళ్లు, మాల్స్ వచ్చి ఎకనమిక్ యాక్టివిటీ పెరిగింది. దీంతో అక్కడి చుట్టుపక్కల భూములకు విలువ పెరిగి రైతులకు మేలు చేకూరింది. అమరావతిలో కూడా అంతర్జాతీయ విమానాశ్రయం, క్రికెట్ స్టేడియం నిర్మాణాలకు మరికొంత భూమి అవసరం అవుతుంది. వీటి అవసరాలకు అనుగుణంగా భూమిని తీసుకోవాల్సి ఉంటుంది. రాజధాని కోసం స్వచ్ఛంధంగా భూములు ఇచ్చిన రైతుల అభీష్టానికి వ్యతిరేకంగా, వారికి నష్టం జరిగేలా ఏ కార్యక్రమం, నిర్ణయం ఉండదని సిఎం అన్నారు. 'కృష్ణానదిపై మరో మూడునాలుగు వారధిలు కూడా వస్తాయి. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు వస్తాయి. ఇతర ప్రాంతాలకు కనెక్టవిటీ పెరుగుతుంది. రాజధాని విస్తరించి పెద్ద ఎత్తున సంస్థలు, పెట్టుబడులు వస్తాయి. అదనపు భూసేకరణ కారణంగా ఈ ప్రాంతంలో ధరలు పడిపోతాయనే అపోహలకు గురికావద్దు. నాకు, రైతులకు మధ్య దూరం ఉండదు. మీ ప్రయోజనాలకు విరుద్ధంగా ఏమీ జరగదు"అని సీఎం అన్నారు. రాజధాని ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రైతుల త్యాగాలకు గుర్తుగా స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని రైతులు కోరగా...శాతవాహన కాలం నుంచి అమరావతి ఉద్యమం వరకు జరిగిన పరిణామాలన్నీ క్రోడీకరిస్తూ మ్యూజియం ఏర్పాటు చేస్తామని సీఎం అన్నారు. అంతేకాకుండా రాజధాని పరిధిలోని గ్రామ కంతాల్లో ప్రస్తుతం నివాసం ఉంటూ పట్టాలేని వారికి పట్టాలివ్వాలని వారు కోరగా...ఈ కార్యక్రమాన్ని కూడా త్వరలోనే చేపడతామని సీఎం హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# క్షణ మరియు క్షిపణి పరికరాల తయారీలో అగ్రగామిగా నిలవనున్న ఆంధ్రప్రదేశ్




అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్ర పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో రక్షణ, క్షిపణి విధానం, పారిశ్రామిక క్లస్టర్ల రూపకల్పన కోసం పారిశ్రామిక భాగస్వాములతో సోమవారం విజయవాడలోని ఒక ప్రముఖ హోటల్ లో పత్రికా సమావేశం నిర్వహించడం జరిగింది. ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం 2025-2029 సంవత్సర కాలానికి విడుదల చేయబోతున్న రక్షణ మరియు క్షిపణి విధానం 4.0 పై పలు వ్యాపార భాగస్వాముల నుండి సలహాలు, సూచనలు మరియు అమలు విధానం వంటి అంశాలు ముఖ్య ఉద్దేశాలుగా ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శి, N.యువరాజ్, మాట్లాడుతూ "ప్రపంచ వ్యాప్తంగా రక్షణ రంగానికి పెరుగుతున్న డిమాండ్, భౌగోళిక రాజకీయ తెగింపులు మరియు విస్తరిస్తున్న భద్రతా భిన్నత్వాల నేపథ్యంలో, దేశం భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ రక్షణ రంగంలో వ్యూహాత్మక మార్పులకు ఆంధ్ర ప్రదేశ్ శ్రీకారం చుట్టిందన్నారు. దీనికి తోడుగా భారత ప్రభుత్వం కూడా తన ఆపన్న హస్తాన్ని అందిస్తూ రక్షణ నిర్మాణ రంగానికి గతంలో ఎన్నడు లేని విధంగా బడ్జెట్ కేటాయింపుల వలన రక్షణ మరియు క్షిపణి రంగాలను అభివృద్ధి చేయాలనే కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల యొక్క దృఢ సంకల్పంను ప్రతిబింబిస్తుందన్నారు.

పెట్టుబడులను ఆకర్షించడం, మరియు యువతకు స్కిల్ డెవలప్ మెంట్ ద్వార ఉపాది అవకాశాలను కల్పించడంపై రాష్ట్రం కట్టుబడి ఉందన్నారు. దీని వలన భారత విమానయాన మరియు రక్షణ రంగంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ఒక కీలక పాత్ర పోషించే అవకాశం ఉందన్నారు. అంతే కాకుండా ఆంధ్ర ప్రదేశ్ లో రక్షణ పరికరాల తయారీకి ప్రైవేటు భాగస్వాముల సహకారం ఎంతో అవసరమన్నారు. స్థానిక తయారీ వ్యవస్థకు 2019 లోనే కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది అని దీని వలన రక్షణ రంగానికి సంబంధించిన వార్షిక ఉత్పత్తి రూ. 1.27 లక్షల కోట్లుగా ఉందన్నారు. మన దేశం నుండి 85 దేశాలకు రక్షణ రంగానికి సంబంధించిన పరికరాలను ఎగుమతి చేస్తున్నామన్నారు. CAGR (2016-17) లెక్కల ప్రకారం ప్రైవేటు భాగస్వాముల ద్వారా 21% రక్షణ రంగానికి సంబంధించిన పరికరాల తయారీకి దోహదం చేస్తుందన్నారు. కానీ పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్&డి)లో వెనుకపడ్డామని దానిని అధిగమించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రైవేటు భాగస్వాముల సహకారం అవసరమన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాలనుకునే అభివృద్ధిదారులకు భూమిని మరియు ప్రోత్సాహకాలను అందించడానికి సిద్ధంగా ఉందని ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా గోదావరి డెల్టాల మినహా మిగిలిన ప్రాంతాలలో 30 కి పైగా క్లస్టర్ లను గుర్తించిందని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 3 పారిశ్రామిక కారిడార్ లను ప్రకటించిందని తెలిపారు. ఆర్థిక అభివృద్ధికి, పారిశ్రామిక ప్రగతికి అందుబాటులో ఉన్న మన అపార భూ సంపదను అభివృద్ధికి ఆలంబనగా వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా అడుగులు వేస్తుందన్నారు.రాష్ట్రంలోని తయారీ పరిశ్రమను ప్రోత్సహించడానికి, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 4.0 ను అమలు పరిచేందుకు నాలుగు ప్రాధ్యామ్యాలుగా విభజిస్తూ: 1- విమానాలు, క్షిపణి 2- ఆయుదాలు 3- నావికా మరియు నౌకా నిర్మాణం 4- రక్షణ ఎలక్ట్రానిక్స్ గా 4.0 ప్రణాళికను రూపొందించడం జరిగిందన్నారు.. ఈ సమగ్ర విధానం ద్వారా రక్షణ మరియు క్షిపణి విమాన రంగాలలో రూ. 20,000 కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించి 50,000 ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ.నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లో స్వర్ణాంధ్ర 2047 కి అనుగుణంగా పనిచేస్తున్నామని యువరాజ్ తెలిపారు. భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ సలహాదారు సతీష్ రెడ్డి మాట్లాడుతూ "రక్షణ రంగంపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయంపులను భారీగా పెంచిందన్నారు. అగ్రరాజ్యాలు ఎల్లప్పుడూ కీలక రక్షణ వ్యవస్థల మరియు స్వదేశీ ఉత్పత్తి వ్యూహాన్ని అనుసరించాయని తెలిపారు . స్థానిక తయారీ రంగాలకు డిమాండ్ పెరిగిందని, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ లో రక్షణ మరియు క్షిపణి పరికరాల తయారీ రంగాలలో అగ్రగామిగా ఉండబోతుందని ఆశాభావం వ్యక్తం చేసారు. రాజస్థాన్, అస్సాం మరియు గుజరాత్ వంటి ఇతర రాష్ట్రాలు కూడా రక్షణ మరియు క్షిపణి పరికరాల తయారీ రంగాలకు సంబందించి విధానాలను ఇప్పటికే విడుదల చేశాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రక్షణ రంగ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రోత్సాహకాలతో కూడిన సమగ్ర విధానాన్ని రూపొందించుకోవాలని సూచించారు.

స్పేస్ టెక్నాలజీ ప్రభుత్వ సలహాదారు, డాక్టర్. S.P.సోమనాథ్, మాట్లాడుతూ "ఖగోళ రంగంలోని అవకాశాలను ప్రస్తావిస్తూ, ముఖ్యంగా భారతదేశం ఇప్పటివరకు చెప్పుకోదగ్గ విజయాలను ఎన్నో సాధించినప్పటికీ ఆశించిన స్థాయిలో స్టార్టప్స్ లేకపోవడం మన లోపం అని ఆయన అన్నారు. ఖగోళ రంగంలో ప్రస్తుతం టెక్నాలజీలకు అధిక డిమాండ్ ఉందని, ఈ అవసరాలను తీర్చగలిగే స్టార్టప్ లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు సమగ్ర విధానాల ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు అని తెలిపారు. శ్రీహరి కోటలో నూతనంగా ఏర్పాటు చేసిన లాంచ్ ప్యాడ్ ద్వారా 50 శాటిలైట్లను రాబోయే 5 ఏళ్లలో నిర్మించి ప్రయోగించాలన్న లక్ష్యం తో ముందుకు సాగుతున్న తరుణంలో రాష్ట్రానికి మరింత ప్రయోజనం కలగనుంది అని తెలిపారు..

మేజర్ జనరల్ అజయ్ మిశ్రా మాట్లాడుతూ "ఆయుధబలాల సేనలు స్థానికీకరించిన తయారీకి సంబంధించిన సమస్యలను గుర్తించాయని తెలిపారు. సేనకు బడ్జెట్ నికరాలలో 60% కేటాయించడం వల్ల తయారీదారులకు డిమాండ్ పెరుగుతుందని ఆయన అన్నారు. 2032 నాటికి 85% స్థానికీకరణ లక్ష్యాన్ని సేన నిర్ణయించుకుందని ఆయన వివరించారు.

విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ ఈ సమావేశం కేవలం రాష్ట్రంలో ప్రైవేటు భాగస్వాముల ద్వారా వ్యాపార సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా ఒక చారిత్రాత్మిక మార్పుకు నాంది పలికిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. నారా చంద్రబాబు నాయుడు గారి ఆశయమైన స్వర్ణాంధ్ర 2047 కు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధికి ప్రైవేటు భాగస్వాముల సహకారం చాలా అవసరమన్నారు.

APIIC చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి మరియు భవిష్యత్తుకు ప్రైవేటు భాగస్వాముల తోడ్పాటు చాల ముఖ్యమని వారి వ్యాపారాలకు సంబంధించిన సమస్యలకు సత్వరమే పరిష్కార మార్గాలను అందించడానికి అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు ఎల్లపుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో భాగంగా కార్యక్రమానికి హాజరయిన పలువురు వ్యాపారవేత్తలు, పబ్లిక్ సంస్థల యజమానులు తమ సూచనలను, వారు ఎదుర్కుంటున్న సమస్యలను , వినతులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశానికి పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖాధికారులు, వ్యాపార సంస్థల యజమానులు హాజరయ్యారు.

# కొత్త తరహా ప్రకటన వ్యూహాలతోనే ఆప్కో, లేపాక్షిల అభివృద్ధి

**-పర్యాటక ప్రదేశాలలో ఆప్కో, లేపాక్షి షోరూంల ఏర్పాటుకు చర్యలు**



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : వాణిజ్య సంస్థలకు ప్రచారం అత్యంత కీలకమని చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా పేర్కొన్నారు. మెరుగైన అమ్మకాల కోసం ఆధునిక మార్కెటింగ్ పద్ధతులు అనుసరించి కొత్త తరహా ప్రకటనా వ్యూహాలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం చేనేత, జౌళి శాఖ, ఆప్కో, లేపాక్షి మరియు ఆంధ్రప్రదేశ్ ఖాదీ గ్రామీణ పారిశ్రామిక మండలి అధికారులతో మంగళగిరి చేనేత జౌళి శాఖ కమీషనరేట్ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ పర్యాటక కేంద్రాల్లో ఆప్కో , లేపాక్షి షోరూములను ప్రారంభించాలని సూచించారు. లేపాక్షి బ్రాండ్ ద్వారా పురాతన శైలి కలిగిన కలప (ఆంటిక్ వుడ్) ఫర్నిచర్ విక్రయాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు. గ్రామీణ స్థాయిలో స్థానిక ప్రతిభను ప్రోత్సహించి, కొత్త డిజైన్ల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని, ప్రతిభావంతులైన కళాకారులను గుర్తించి అవార్డులు ఇవ్వాలని సూచించారు. ఉత్పత్తులకు విలువ జోడించే మార్గాలను అన్వేషించాలని పేర్కొన్నారు. తిరుమలలో కొత్తగా నిర్మించనున్న లేపాక్షి భవనం రాష్ట్ర పౌరాణిక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఉండాలన్నారు. ఆప్కోకు ప్రభుత్వ శాఖల వద్ద నుండి రావలసిన బకాయిలను (బ్యాడ్ డెబిట్స్) తక్షణమే వసూలు చేయాల్సిన అవసరముందని, దీని కోసం ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రచార కార్యక్రమాల కోసం ప్రతిష్టాత్మక ప్రచార సంస్థలను నియమించాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు తమ అవసరాలన్నింటిని ఆప్కో నుంచే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, అవసరం అయితే ఇందుకు ప్రభుత్వ సహకారం తీసుకుందామన్నారు. ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ కమిషనర్ జి. రేఖారాణి తమ శాఖ చేపట్టిన తాజా కార్యక్రమాలు, ప్రగతి అంశాలను వివరించి, సమగ్ర సమాచారం అందించారు. లేపాక్షి , ఆప్కో సంస్థల ఎండీ ఎం. విశ్వ మాట్లాడుతూ ఈ రెండు సంస్థల నేపథ్యం, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు వివరించారు. ఆప్కో కు ప్రభుత్వ మద్దతు ఆవశ్యకతను ప్రస్తావించారు. కెవిఐబి సీఈఓ వీఆర్. విజయరాఘవ నాయిక్ శాఖ ప్రధాన కార్యక్రమాలు, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని వివరించారు. ఈ సమావేశంలో చేనేత, హస్తకళల అదనపు సంచాలకుడు మురళీ కృష్ణ, సంయుక్త సంచాలకులు కన్నబాబు, నాగేశ్వరరావు, రాజారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రతిపాదిత కార్యక్రమాల అమలుకు చర్యల ప్రణాళిక రూపొందించి, విభాగాల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు.

# రైతులెవ్వరూ మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం అమ్మొద్దు..

**-ఎపి రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరావు**



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రంలోని రైతాంగం ఎవరూ రబీ ధాన్యాన్ని మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవద్దని, రైస్ మిల్లర్లు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలు కలిగిన ఎఫ్.ఏ.క్యూ (ఎఫ్ ఏ క్యూ) ధాన్యాన్ని ఎం.ఎస్.పి చెల్లించి కొనేందుకు సిద్ధంగా ఉన్నారని ఏ.పి రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరావు విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్ లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో మీడియా సమావేశంలో అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరావు మాట్లాడుతూ. రైస్ మిల్లర్లు రైతుల ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటున్నారని, ఇటీవల కొన్ని పత్రికలలో, మీడియాల్లో వార్తలు వస్తున్నాయని, ఇది వాస్తవం కాదన్నారు. నాణ్యత తక్కువగా ఉన్న ధాన్యం, అధిక తేమను కలిగి, ప్రభుత్వ నాణ్యతా ప్రమాణాలు (ఎఫ్.ఏ.క్యూ) ప్రకారం లేని ధాన్యం కొంత ధర తగ్గించి కొని ఉండవచ్చన్నారు. ఎఫ్.ఏ. క్యూ ప్రకారం ఉన్న ధాన్యాన్ని ఖచ్చితంగా ఎం.ఎస్.పి ప్రకారమే మిల్లర్లు కొంటున్నారని, ఇందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. రబీ ధాన్యం సేకరణలు నిలిపివేశారన్న పుకార్లు నమ్మవద్దని, రైతుల వద్ద ఉన్న ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యం పూర్తిగా కొనేందుకు రైస్ మిల్లర్లు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. ప్రభుత్వం గత సంవత్సరం కంటే అధిక పరిమాణంలో ధాన్యం కొనుగోళ్ళు చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ కొనుగోళ్లు తరువాత కూడా రైతుల వద్ద మిగిలిన ఎఫ్.ఏ.క్యూ ధాన్యాన్ని మిల్లర్లు మద్దతు ధరకు కొంటారన్నారు. ఇందుకు అవసరమైన గోనె సంచులు, రవాణా వాహనాలను మిల్లర్లు రైతాంగానికి అందుబాటులో ఉంచుతారన్నారు. ఎవరైనా మిల్లరు మద్దతు ధరకు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలు కలిగిన ఎఫ్.ఏ.క్యూ ధాన్యం కొనుగోలు చేయకపోతే రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఫోన్ నెం:7386623036కు తెలియ చేయాలని, అటువంటి వారిపై అసోసియేషన్నరంగా చర్యలు తీసుకుంటామన్నారు. 75 కిలోల బస్తా ధాన్యానికి రూ.1725లు మద్దతు ధరను చెల్లిస్తామని గుమ్మడి తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఈ సంవత్సరం 2024-25 రబీ పంట కాలంలో ధాన్యం 12 జిల్లాల నుండి 53 నేల 890 మంది రైతుల నుండి 1318 కోట్ల రూ.లు చెల్లించి 5 లక్షల 71వేల 109టన్నులు కొనుగోలు చేశారని తెలిపారు. అంతకు ముందు సంవత్సరాలతో పోల్చితే 2023-24 రబీలో 2,95,044 టన్నులు, 2022-23లో 1,23,902 టన్నులు, 2021-22లో 1,99,154 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారన్నారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ అధికారుల కృషిని ఆయన అభినందించారు. ధాన్యం రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ చర్యలతో పాటు, రైస్ మిల్లింగ్ ఇండస్ట్రీ కూడా సిద్ధంగా ఉందని, ఎవ్వరూ అధైర్య పడే అవసరం లేదని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ షేక్ బాజీ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు అన్నే శ్రీనివాసరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పలు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసిన సీఎం చంద్రబాబు

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : పది జిల్లాలకు సహకార బ్యాంకు, సంఘాల చైర్మన్ల నియామకం

శ్రీకాకుళం డీసీసీబీ ఛైర్మన్‌గా శివ్వల సూర్యనారాయణ(టీడీపీ) - విశాఖ డీసీసీబీ ఛైర్మన్‌గా కోన తాతారావు(జనసేన) - విజయనగరం డీసీసీబీ ఛైర్మన్‌గా కిమిడి నాగార్జున(టీడీపీ) - గుంటూరు డీసీసీబీ ఛైర్మన్‌గా మాకినేని మల్లికార్జునరావు(టీడీపీ) - కృష్ణా డీసీసీబీ ఛైర్మన్‌గా నెట్టెం రఘురామ్(టీడీపీ) - నెల్లూరు డీసీసీబీ ఛైర్మన్‌గా ధనుంజయరెడ్డి(టీడీపీ) - చిత్తూరు డీసీసీబీ ఛైర్మన్‌గా అమాస రాజశేఖర్ రెడ్డి(టీడీపీ) - అనంతపురం డీసీసీబీ ఛైర్మన్‌గా కేశవరెడ్డి(టీడీపీ) - కర్నూలు డీసీసీబీ ఛైర్మన్‌గా డి. విష్ణువర్ధన్ రెడ్డి(టీడీపీ) - కడప డీసీసీబీ ఛైర్మన్‌గా బి.సూర్యనారాయణరెడ్డి(టీడీపీ)

శ్రీకాకుళం డీసీఎంఎస్ ఛైర్మన్‌గా అవినాష్ చౌదరి(టీడీపీ) - విశాఖ డీసీఎంఎస్ ఛైర్మన్‌గా కొట్ని బాలాజీ(టీడీపీ) - విజయనగరం డీసీఎంఎస్ ఛైర్మన్‌గా గొంప కృష్ణ(టీడీపీ) - గుంటూరు డీసీఎంఎస్ ఛైర్మన్‌గా వడ్రాణం హరిబాబు(టీడీపీ) - కృష్ణా డీసీఎంఎస్ ఛైర్మన్‌గా బండి రామకృష్ణ(జనసేన) - నెల్లూరు డీసీఎంఎస్ ఛైర్మన్‌గా గొనుగోడు నాగేశ్వరరావు(టీడీపీ) - చిత్తూరు డీసీఎంఎస్ ఛైర్మన్‌గా సుబ్రమణ్యంనాయుడు(టీడీపీ) - అనంతపురం డీసీఎంఎస్ ఛైర్మన్‌గా నెట్టెం వెంకటేశ్వర్లు(టీడీపీ) - కర్నూలు డీసీఎంఎస్ ఛైర్మన్‌గా జి.నాగేశ్వరయాదవ్(టీడీపీ) - కడప డీసీఎంఎస్ ఛైర్మన్‌గా యర్రగుండ్ల జయప్రకాశ్(టీడీపీ)

# ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి సహకరించండి..

**రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్**



ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి అగ్రగామి గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను స్థాపించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి పూర్తిగా సహకరించాలని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను.. మంత్రి టి.జి భరత్ కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్ ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి సంబంధించి కీలక అంశాలపై చర్చించారు. టమోటా పంటను అధికంగా పండిస్తున్న రాయలసీమ జిల్లాల్లో ఆపరేషన్ గ్రీన్స్ పథకం కింద మొదటి విడత రెండవ విడత మొత్తం రూ. 9.76 కోట్లు విడుదల చేయాలని మంత్రి టి.జి భరత్ కోరారు. ఆరు నెలల్లోపు మొత్తం ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేయడానికి మిగిలిన గ్రాంట్ మొత్తం రూ. 34.17 కోట్లు విడుదల చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. రాయలసీమ జిల్లాల్లో రైతులు టమోటా పంటను అత్యధికంగా సాగు చేస్తారని కేంద్ర మంత్రికి వివరించారు. టమోటా ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్స్ ఏర్పాటుచేయడం ద్వారా పంట కోత తర్వాత నష్టం జరగకుండా చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతానికి ఈ కేంద్రాలు ఎంతో ముఖ్యమైనవని చెప్పారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందన్నారు. ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో 175 పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి టి.జి భరత్.. కేంద్ర మంత్రికి వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను అభివృద్ధి చేయడం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీఎంకేఎస్‌వై స్కీమ్స్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టాలనుకునే వారు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా నేరుగా అప్లై చేసుకునేలా ఏపీకి వెసులుబాటు కల్పించాలని మంత్రి టి.జి భరత్ కోరారు. ఇప్పుడున్న ప్రక్రియ పెట్టుబడుల ప్రతిపాదనలను సకాలంలో సమర్పించడానికి ఒక అడ్డంకిగా ఉందన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి ఎంతో దోహదపడే ఈ అంశాన్ని పరిశీలించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ సందర్భంగా తిరుపతి ఐఐటీలో ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద రూ. 2.67 కోట్ల గ్రాంట్‌తో స్థాపించిన ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి సంబందించిన అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు.

# నందమూరి బాలకృష్ణకి పద్మ భూషణ్ అవార్డు



ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల ప్రదానోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డు గ్రహీతలకు పద్మ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ వేడుకలో ప్రధాని మోడీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. తెలుగు సినీ పరిశ్రమ నుండి హీరో నందమూరి బాలకృష్ణకి కేంద్రం పద్మ భూషణ్ అవార్డుతో సత్కరించింది. దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మభూషణ్' పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. కళారంగంలో, సామాజిక సేవలకు గాను బాలకృష్ణకు పద్మభూషణ్ పుసరస్కారం వరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. అవార్డ్స్ వేడుకకు నందమూరి బాలకృష్ణ తెలుగుదనం ఉట్టిపడేలా పంచె కట్టులో హాజరయ్యారు. ఐదు దశాబ్దాలపైబడి తెలుగు చలనచిత్ర సీమలో వెండితెరపై విభిన్న పాత్రలు పోషించాడు బాలకృష్ణ. ఆయన సినీ కెరీర్‌లో, 110 చిత్రాలలో, ఆయన తన అసాధారణ నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు. అంతేకాకుండా హిందూపురం శాసన సభ్యుడిగా, బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి ఛైర్మన్ గా ఎన్నో సేవలందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ దంపతులతో పాటుగా, బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ, కూతురు తేజస్విని ఆయన భార్య వసుందర పాల్గొన్నారు.

# మే 2వ తేదీన ప్రధానమంత్రి పర్యటనకు విస్తృతమైన ఏర్పాట్లు : సిఎస్



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : మే 2వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోడి అమరావతి రాజధాని పనుల పునః ప్రారంభించేందుకు వస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించి విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్ పేర్కొన్నారు.సోమవారం విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రధాని పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ జిల్లాల నుండి వచ్చే ప్రజలందరూ 2వ తేది మధ్యాహ్నం 1.30 గం.లకు సభా వేదిక వద్దకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రతి బస్సులో ఒకవ్యక్తిని ఇన్చార్జిగా ఉంచి సురక్షితంగా తీసుకు వచ్చి తరిగి వారి గమ్య స్థానాలకు చేర్చేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు.అంతేగాక వేసవి దృష్ట్యా సభకు వచ్చే వారందరికీ తగిన ఆహారం, తాగునీరు వంటి సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని చెప్పారు.బస్సులు బయలుదేరే సమయంలోనే ఆహారం,తాగునీరు అందించాలని,మరలా దారిలో సంబంధిత జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో మధ్యాహ్న భోజనం అందించాలని సిఎస్ స్పష్టం చేశారు.అలాగే రాత్రి భోజనం ఏర్పాట్లను సభా వేదిక ప్రాంగణంలోని వివిధ పార్కింగ్ స్థలాల వద్ద గుంటూరు జిల్లా కలెక్టర్ ద్వారా ఏర్పాటు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రధాని సభకు వివిధ జిల్లాల నుండి ప్రజలను తీసుకు వస్తున్నందున పెద్ద ఎత్తున బస్సులు,ఇతర వాహనాలు జాతీయ రహదారులు,ఇతర ప్రధాన రహదారులపై ప్రయాణించనున్న నేపధ్యంలో ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా ముందుగానే తగిన ప్రణాళిక చేసుకోవాలని అదనపు డిజిపి శాంతి భద్రతలు,కలెక్టర్లు,ఎస్పి లను సిఎస్ విజయానంద్ ఆదేశించారు. ఈసమావేశంలో ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ రాష్ట్ర నోడలు అధికారి జి.వీరపాండ్యన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి అమరావతి పర్యటనకు సంబంధించి టెంటటివ్ కార్యక్రమాన్ని వివరిస్తూ 2వ తేది మధ్యాహ్నం 2.30.గం.లకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని తదుపరి హెలీకాప్టర్లో రాష్ట్ర సచివాలయ ప్రాంగణానికి అక్కడ నుండి సభా ప్రాంగణానికి చేరుకుని సభ అనంతరం హెలీకాప్టర్లో గన్నవరం విమానాశ్రయం చేరుకుని ఢిల్లీ బయలుదేరి వెళతారని చెప్పారు.వివిధ జిల్లాల నుండి ప్రజలు సభా వేదికకు చేరుకునేలా విజయవాడ,గుంటూరుల నుండి 8 రూట్లను సిద్ధం చేశామని తెలిపారు.సభా వేదిక సమీపంలో 11 పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.ఇంకా వివిధ ఏర్పాట్లపై వివరించారు.

## ప్రజా రాజధానికి మళ్లీ ఊపిరి పోద్దాం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో కూటమి ఏర్పడ్డానికి కారణం అయ్యింది. 2024లో కూటమి ఘన విజయం సాధించడానికి తోడ్పడింది.

**అపోహలు వద్దు... అదంతా ప్రచారం మాత్రమే...** రాజధాని ప్రాంతం అభివృద్ధి కోసం 33 వేల ఎకరాలు కాకుండా మరో 44 వేల ఎకరాలు సేకరిస్తున్నారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. దీంతో రైతులు చాలా ఆందోళన చెందుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. అలాంటి అనుమానాలు, అపోహలు ఉంటే మరిచిపోండి. కూటమి ప్రభుత్వం కొత్తగా భూ సమీకరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మా దృష్టంతా ప్రస్తుతం సేకరించిన 33 వేల ఎకరాల అభివృద్ధిపైనే ఉంది. సీఆర్డీఏ పరిధిలోనే రూ.30 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నాం. భవిష్యత్తులో అవసరాల కోసం భూమి సేకరించాలని కొంతమంది మాట్లాడినా ముఖ్యమంత్రి గారు ఎటువంటి నిర్ణయం గానీ, ఆదేశాలుగానీ ఇవ్వలేదు. దాని గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

**ప్రతి సమస్యను పరిష్కరిస్తాం..** రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి, ప్రతి ఇంటికి సంక్షేమం చేరాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు పని చేస్తున్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా పెన్షన్లు ఒకటో తేదీనే అందిస్తున్నాం. ప్రతి నెల దాదాపు 60 లక్షల మందికి రూ. 2700 కోట్లు పంపిణీ చేస్తున్నాం. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో రైతులకు రూ.1674 కోట్లు బకాయిలు పెడితే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే బకాయిలు చెల్లించాం. 10 వేల కోట్ల రూపాయల ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేశాం. బేతపూడిలో సీసీ రోడ్లు, డ్రైనేజ్ సమస్యలు, కళ్యాణ మండపం నిర్మాణం, శ్మశాన వాటిక అభివృద్ధి గురించి అడిగారు. కచ్చితంగా సమస్యలు పరిష్కరిస్తాం. స్థానిక ప్రజలకు రాజధాని నిర్మాణ పనుల్లో అవకాశం కల్పించే అంశాన్ని ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి దృష్టికి తీసుకెళ్తాం. అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతుల చేతుల మీదగానే రాజధాని నిర్మాణం జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్, గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు బేతపూడి విజయ్ శేఖర్, గంజి చిరంజీవి, శ్రీమతి బడే కోమలి, వాసా శ్రీనివాసరావు, అడపా నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్ యువత చేతిలోనే

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే పనిచేస్తున్నాయి. భవిష్యత్‌లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యూనివర్సిటీలు అమరావతికి రాబోతున్నాయి. 29 వేల మంది రైతులు, రైతు కూలీలు అమరావతికి సహకరించారు. వారందరినీ తీసుకెళ్లాల్సిన బాధ్యత మాపై ఉంది. వారిలో కొందరిని దత్తత తీసుకోమని విట్ చాన్సలర్ జి. విశ్వనాథన్‌ను నేను కోరాను.

**నాసా నుంచి వాల్ స్ట్రీట్ వరకూ మనోళ్లే..** విద్యార్థులకు చదువు ముఖ్యం. చదువుతోనే విజ్ఞానం వస్తుంది. జ్ఞానాన్ని ఆచరణలో పెట్టాలంటే వినూత్నంగా ఆలోచన చేయాలి. నాలెడ్జ్ ఎకానమీలో ప్రపంచవ్యాప్తంగా భారతీయులు ముందుంటే, అందులో తెలుగువారు ట్రెండ్‌సెట్టర్లుగా ఉన్నారు. మన తెలుగువారి జనాభా 5 శాతమే అయినప్పటికీ ఐఐటీల్లో 20 శాతం సీట్లు మనవాళ్లే సాధిస్తున్నారు. సిలికాన్ వ్యాలీ నుంచి స్పేస్ ఎక్స్ వరకు, గూగుల్ నుంచి మైక్రోసాఫ్ట్ వరకు, నాసా నుంచి వాల్ స్ట్రీట్ వరకు అన్ని చోట్ల మన తెలుగువారే సత్తా చాటుతున్నారు. సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, ఇంద్రానూయి, అజయ్ బంగా, శాంతను నారాయణ్ వంటి వారు గ్లోబల్ సంస్థల్ని బలోపేతం చేస్తుండటం మనకు గర్వకారణం.

**ఎన్టీఆర్ స్ఫూర్తితో పీ4కు శ్రీకారం...** సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అని నినదించిన ఎన్టీఆర్ స్ఫూర్తితో పీ4కు శ్రీకారం చుట్టాం. సమాజంలో ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న 10 శాతం మంది ఆర్థిక ఇబ్బందులతో, పేదరికంలో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను పైకి తీసుకురావాలి. 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం అనే మాట వినపడకూడదు. పౌరుల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించాలనే ఉద్దేశంతో వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టాం. ఒకప్పుడు చిన్న పనికి కూడా ఎమ్మార్వో ఆఫీస్‌కి వెళ్లాల్సి వచ్చేది. గంటల తరబడి కార్యాలయాల దగ్గర పడిగాపులు పడాల్సి వచ్చేది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 1,000 సేవలను పెంచుతాం.

**స్వర్ణాంధ్ర కల సాకారం చేస్తాం...** ఏటా 15 శాతం వృద్ధి రేటుతో స్వర్ణాంధ్ర 2047 సాధించాలని నిర్ణయించాం. 2047 నాటికి తలసరి ఆదాయం రూ.55 లక్షలు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రధాని మోదీ వికసిత్ భారత్ 2047 ప్రణాళిక తయారు చేశారు. 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో నిలుస్తుంది. టెర్రరిస్టుల కుట్రలు, కుయుక్తులు మనల్ని ఏం చేయలేవు. మన ఐక్యతను దెబ్బతీయలేవు. రాష్ట్ర స్థాయిలో ప్రతి ఇంటిని జియో ట్యాగింగ్ చేస్తున్నాం. దీనివల్ల భవిష్యత్‌లో ఏదైనా విపత్తు వస్తే మందులు, ఆహారం డ్రోన్ల ద్వారా పంపవచ్చు.

**విశాఖకు త్వరలో మెట్రో రైల్...** విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం. విశాఖకు కొత్త ఎయిర్ పోర్టు, మెట్రోతో పాటు త్వరలో గూగుల్ రాబోతున్నది. ఇప్పటికే విశాఖలో స్టీల్ ప్లాంట్ ఉంది. అనకాపల్లిలో ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ దిగ్గజ కంపెనీ రూ.లక్ష కోట్లతో పెట్టుబడులు పెడుతోంది. రాయలసీమలోనూ స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపడతాం. అనంతపురంలో లేపాక్షి మొదలు ఓర్వకల్లు వరకూ నాలెడ్జ్ హబ్‌గా తయారుచేస్తాం. రాయలసీమను డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్స్, డ్రోన్, శాటిలైట్ లాంచింగ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అభివృద్ధి చేస్తాం. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తాం. మోదీ నాయకత్వంలో మేకిన్ ఇండియా కార్యక్రమం కింద 130 బిలియన్ యుఎస్ డాలర్లతో హార్డ్‌వేర్ రంగం అభివృద్ధి చెందుతోంది. భవిష్యత్‌లో 500 బిలియన్ యూఎస్ డాలర్ల విలువైన ఉత్పత్తులు తయారుచేసే స్థాయికి దేశం చేరు తుంది.

**విట్ విద్యార్థుల ప్రశ్నలు- సీఎం సమాధానాలు..** అమరావతిలో అభివృద్ధి పనులు, రాష్ట్రంలో కొత్త విద్యా సంస్థల ఏర్పాటు, ఐటీ, ఏఐ వినియోగంపై విట్ విద్యార్థులు పలు ప్రశ్నలు అడగ్గా ముఖ్యమంత్రి వాటికి సమాధానం చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడంతో పాటు పేదరికం రూపుమాపడం, యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామని సీఎం చెప్పారు. ఎన్టీఆర్, అంబేద్కర్, కలామ్ వంటి వారంతా సాధారణ స్థాయి నుంచి వచ్చినవారేనని మహనీయుల స్ఫూర్తితో యువత తాము ఎంచుకున్న మార్గంలో రాణించాలని అన్నారు. రాజకీయాలను తాను సేవా మార్గంలోనే చూశానని అన్నారు. రాత్రికి రాత్రే జాక్ పాట్ కొట్టేయాలనుకోవడం అత్యాశే అవుతుంది. జీవితంలో కష్టపడి అంచెలంచెలుగా ఎదిగిన వారికి తిరుగుండదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఏపీ మెగా డీఎస్సీ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థుల విషయంలో కీలక నిర్ణయం

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీలోని కూటమి ప్రభుత్వం ఇటీవల 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 20 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ కొనసాగనుంది. ఈ క్రమంలో తాజాగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థుల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా కేటగిరీలకు చెందిన అభ్యర్థులు డిగ్రీలో 40 శాతం మార్కులతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. బీఈడీకి, టెట్‌కు డిగ్రీలో 40 శాతం మార్కుల అర్హత ఉండగా... డీఎస్సీకి మాత్రం 45 శాతం పెట్టడం పట్ల అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వారి అభ్యర్థన మేరకు డిగ్రీలో 40 శాతం మార్కులతో దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇక, జనరల్ అభ్యర్థులకు మాత్రం డిగ్రీలో 50 శాతం మార్కులు ఉండాల్సిందేనని ఈ సందర్భంగా ప్రభుత్వం తేల్చి చెప్పింది. కాగా, ఏపీ డీఎస్సీ-2025కి సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్ %https://apdsc.apcfss.in%/లో పొందుపరిచారు. ఏప్రిల్ 20 నుంచి ప్రారంభమైన ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ, ఫీజుల చెల్లింపు మే 15 వరకు కొనసాగనుంది. అలాగే మే 30 నుంచి అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 6 నుంచి జులై 6 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యశాఖ ఇప్పటికే డీఎస్సీ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది.

